# గిరిజనుల సంక్షేమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

✦ కలెక్టర్ కె. హరిత



**కెరమెరి, జనవరి 20, ప్రభాతవార్త :**

జిల్లాలోని గిరిజనుల సంక్షేమ అభివృద్ధికి అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. జిల్లా మొదటి మహిళా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె మంగళవారం జిల్లాలోని కెరమెరి మండలం జోడెఘాట్ లోని కొమురం భీం సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భీం విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మ్యూజియంను సందర్శించి పొందుపరిచిన అలంకరణలు, చిత్రపటాలు, గిరిజన సంస్కృతికి సంబంధించిన చరిత్రను తిలకించి ఆదివాసీ నాయకులు, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. జోడెన్ ఘాట్ గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ కు ఆదివాసీలు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఆదివాసీ నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 21, జనవరి 2026


## మున్సిపల్ ఎన్నికల వేళ..

# సీటు కావాలంటే ఓటు కావాలంటే నోటు..





**నోట్ల రాజకీయం ఆందోళనకర పరిణామం**

**మంచిర్యాల, జనవరి 20, ప్రభాతవార్త**

తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగలా జరగాల్సి ఉండగా, నోట్ల రాజకీయంతో మసకబారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. "నోట్ల కట్టలు ఉంటేనే సీటు.. నోటు ఉంటేనే ఓటు" అన్న నానుడి ఇప్పుడు ఎన్నికల వాస్తవ పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. పార్టీలకు చెందిన ఆశావహులు టికెట్ల కోసం అధిష్ఠానాల చుట్టూ తిరుగుతూ కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య కార్యకర్తలు, నిజాయితీ గల నాయకులు పోటీకి దూరమవుతుండగా, డబ్బున్న వారికే అవకాశాలు దక్కుతున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇక ఎన్నికల ప్రచారంలో కూడా ఓటర్లను ఆకర్షించేందుకు నగదు, మద్యం, బహుమతుల పంపిణీ జరుగుతోందన్న ఫిర్యాదులు పెరుగుతున్నాయి.



2లో..

## భైంసా సుద్ధవాగుపై అర్ధరాత్రి

# ఘోర రోడ్డు ప్రమాదం



- ప్రమాద స్థలంలో నలుగురు దుర్మరణం
- ప్రాణాపాయ స్థితిలో కుప్టి సర్పంచ్



బోయిడి బాబన్న



రాజన్న



బోజారం పటేల్



డ్రైవర్ బొప్ప వికాస్

**నిర్మల్, జనవరి 21, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని సుద్దవాగు వంతెనపై సోమవారం అర్ధరాత్రి వేళ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నిర్మల్ నుంచి నాందేడ్ మార్గం వైపు వెలుతున్న పరిశ్రమల నిర్వాహణలో వినియోగించే బారీ పరికరాన్ని తీసుకవెలుతున్న ట్రాలీ లారీ, నిజామాబాద్ వైపు నుంచి భైంసాలోనికి వస్తున్న ఏరిటిక వాహనం ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఘటనలో ఎరిటిక వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో నలుగురు ప్రమాద స్థలిలోనే దుర్మరణం పాలయ్యారు.మృతి చెందినవారిలో డ్రైవర్ బొప్ప వికాస్ (24), బోజారం పటేల్ (42), కోడిమెల మిగతా 2లో..

## తహసీల్దార్ కార్యాలయం ముందు

# పోడు రైతుల ధర్నా





**దహెగాం, జనవరి 20,ప్రభాతవార్త**

దహెగాం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు పోడు భూముల రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని ఐనం, పొలంపల్లి, చిన్న గుడిపేట, పెసరికుంట, బీబ్రా, పార్వతీపేట, పెద్ద, చిన్న తిమ్మాపూర్ గ్రామ ప్రజలు గత 60సంవత్సరాలనుండి భూమిని సాగు చేస్తున్నామని, ఇప్పుడు అటవీ అధికారులు వచ్చి ఈ భూములు అన్ని అటవీ భూములని ఎవరు కూడా సాగు చేయవద్దని, వర్ష కాలం నాటికీ మొక్కలు నాటుతామని భూమికి బౌండరీలు మిగతా 2లో..

# సీటు కావాలంటే నోటు.. ఓటు కావాలంటే నోటు..

(మొదటిపేజీ తరువాయి)

పేద ఓటర్ల బలహీనతలను ఆసరాగా చేసుకుని ప్రజాస్వామ్యాన్ని అమ్మకానికి పెడుతున్నారని మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ, నోట్ల ప్రవాహాన్ని అడ్డుకోవడంలో యంత్రాంగం పూర్తిగా విజయవంతమవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. డబ్బు బలం ముందు ప్రజా సమస్యలు, అభివృద్ధి ప్రణాళికలు పక్కన పడిపోతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే స్థానిక సంస్థలపై ప్రజల నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిజాయితీ, సేవా దృక్పథంతో రాజకీయాల్లోకి రావాలనుకునే యువత నిరాశ చెందుతోంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలతో పాటు ఓటర్లపైనా ఉందని పలువురు గుర్తు చేస్తున్నారు. నోట్లకు లొంగకుండా, అభివృద్ధిని కోరే నాయకులను ఎన్నుకోవాల్సిన సమయం ఆసన్నమైందని వారు పిలుపునిస్తున్నారు. లేకపోతే "ప్రజల పాలన" కాస్తా "నోట్ల పాలనగా" మారే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు తెలంగాణ వ్యాప్తంగా వినిపిస్తున్నాయి.

## బైంసా సుద్దవాగుపై అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

పెద్ద రాజన్న (62), బోయిడి బాబన్న (65) ఉన్నారు. ఇదే ఘటనలో కుప్టి సర్పంచ్ గంగాధర్ తీవ్రంగా గాయపడడంతో హుటాహుటిన నిజామాబాద్ కు తరలించారు. అదే ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కుభీర్ మండలం కుప్టి సర్పంచు గంగాదర్ తో పాటు మరో ఐదుగురు గ్రామస్తులు హైదరాబాద్ లో చికిత్స పొందుతున్న గ్రామస్తుడిని పరామర్శించేందు వెళ్లారు. సోమవారం ఉదయం వెళ్లిన వీరందరూ రాత్రి పూట తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్ర యాణిస్తున్న ఏరిటిక వాహనం మరో రెండు నిముషాల వ్యవధిలో బైంసాకు చేరుకునే సమయంలో ప్రమాదానికి గురైంది. ఇక మధ్య సీట్ మధ్య భాగంలో కూర్చున్న గ్రామ సర్పంచు గంగాధర్ తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రమాద సమాచారం అందుకున్న బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, సీఐ సాయి కుమార్ లు ఘటన స్థలికి చేరుకొని ఏరిటిక వాహనంలో చిక్కుకొని మృతి చెంది కొడిమెల పెద్ద రాజన్న, బోయిడి బాబన్నల మృతదేహాలను స్థానికుల సాయంతో బయటకు తీయించారు. అయితే తీవ్రమైన ప్రమా దం కారణంగా బోయిడి బాబన్న శరీరం నుంచి తల బాగం తెగిపోయి వాహనం నుంచి బయట పడిపోయింది. ఇక డ్రైవింగ్ సీట్ నుంచి కింది బాగంలో పడిపోయిన డ్రైవర్ వికాస్ బొప్ప, డోరు ఊడిపోయి రోడ్డుపై పడిపోయిన బోజరామ్ పాటిల్ మృతదేహాలను ట్రాలీ ఆటోలో పోస్టు మార్గం నిమిత్తం ఇక్కడి ఆసుపత్రికి తరలించారు. అనంతరం రోడ్డుపైనున్న రెండు వాహనాలను జేసీబీ ద్వారా తొలగించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ముధోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మృతుల కుటుంబాలను పరామర్శించాడు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను సూచించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి, మృతుల పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## తహసీల్దార్ కార్యాలయం ముందు పోడు రైతుల ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసి జెండాలు పెట్టారని పోడు భూముల రైతులు మంగళవారం నాడు తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. గత 60సంవత్సరాలనుండి భూములు సాగు చేసుకుంటున్నామని, ప్రభుత్వం పట్టా పాసుబుక్ లు ఇచ్చిందని మా భూములు మాకు కావాలని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ మునవీర్ షరీఫ్ కు వినతిపత్రం అందజేసారు. తహసీల్దార్ మాట్లాడుతూ మీ సమస్యలను పై అధికారుల దృష్టికి తుసుకెళ్తానని అన్నారు. అటవీ అధికారులతో మాట్లాడి అటవీ, రెవిన్యూ జాయింట్ సర్వే నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామని. ఈ నెల 30తేదీ నా రైతులు, అటవీ అధికారులు, రెవిన్యూ అధికారులతో సమావేశం నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, దహెగాం ఎస్ ఐ విక్రమ్,తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేరపల్లి అశోక్, చిన్నగుడి పేట సర్పంచ్ పెసరి లింగమూర్తి, ఐనం ఉప సర్పంచ్ కొండగుర్ల మహేందర్, మండల కమిటీ సభ్యులు సిడం శంకర్, వెల్ములే గులాబ్, నానాజీ, నవీన్, పోడు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని




ఆసిఫాబాద్, జనవరి 20, ప్రభాతవార్త

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుండి మున్సిపల్ శాఖ కార్యదర్శి టి కె శ్రీదేవి తో కలిసి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులుకలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఎన్నికలలో వినియోగించే సామాగ్రి, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సామాగ్రి పంపిణీ కేంద్రం, స్వీకరణ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన బడ్జెట్ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులకు గాను 28 పోలింగ్ కేంద్రాలు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు గాను 85 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. వెబ్ కాస్టింగ్, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, పి ఓ లు, ఓ పి ఓల నియామకం, శిక్షణ, ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, స్వీకరణ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు గజానన్, రాజేందర్, పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయి అభివృద్ధి సర్పంచ్‌ల బాధ్యత

- జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్

కాగజ్‌నగర్ రూరల్, జనవరి 20, ప్రభాతవార్త

గ్రామస్థాయిలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి సర్పంచ్‌ల బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్‌లోని మైనార్టీ వెల్ఫేర్ స్కూల్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ, టిజిఐఆర్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, మాస్టర్ ట్రైనర్లు, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, హరికిషన్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ సర్పంచ్ల శిక్షణలో భాగంగా నెల 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు మొదటి విడత, ఫిబ్రవరి 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు రెండవ విడత, 9వ తేదీ నుండి 13వ తేదీ వరకు మూడవ విడత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సర్పంచ్‌లు పంచాయతీ వ్యవస్థను మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల ఆశయాలను నెరవేర్చే బాధ్యత సర్పంచ్‌లదే అని, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక వ్యవస్థ, పాలన విధానాలు, నిబంధనలు, నిర్వహణ అంశాలలో పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండడం అవసరమని తెలిపారు. శిక్షణలో గ్రామ పంచాయతీ విధులు, అధికారాలు ఇతర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో పరిపాలన సమర్ధవంతంగా అమలు చేసేందుకు అవసరమైన నైపుణ్యం, జ్ఞానం అందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమం గ్రామాభివృద్ధికి అత్యంత కీలకమైనదని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మల్లేశం, శ్రీనివాస్, ప్రసాద్, మండల పంచాయతీ అధికారులు శ్రీనివాస్, సాయిరాం, మండలాల సర్పంచు లు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

## గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:

ఈ నెల 26వ తేదీన జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వేడుకల నిర్వహణకు పర్యవేక్షకులుగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వ్యవహరిస్తారని, అదేవిధంగా పలు శాఖల అధికారులు చేపట్టావాల్సిన విధులను వివరించారు. వేడుకలలో పారిశుద్ధ్య పనులు, నిరంతర విద్యుత్ సరఫరా పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల జాబితాను ఈ నెల 24వ తేదీన కలెక్టరేట్ పరిపాలన అధికారికి అందించాలని తెలిపారు. వేడుకలలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులపై స్టాల్స్ ప్రదర్శించాలని, విద్యార్థులచే దేశభక్తి గీతాలపై సాంస్కృతిక ప్రదర్శన ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డ్రైవర్లు తదితర సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ



# ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే సురక్షిత జీవితం

**- మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్**

మంచిర్యాల, జనవరి 20, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలో అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఆటో,లారీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమంలో రోడ్డు మీద ప్రయాణం చేసే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని మంచిర్యాల జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏ. భాస్కర్ అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం, వాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడం అనే ముఖ్య ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్-అలైవ్ కార్యక్రమం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఆటో,లారీ డ్రైవర్లు,వాహన యజమానులకు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ ఏ. భాస్కర్ మాట్లాడుతూ,గత సంవత్సరం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 150 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, మన కుటుంబాల భద్రతకు సంబంధించిన అంశమని తెలిపారు. ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రతను తమ జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. మద్యం సేవించి, అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారు లేదా శాశ్వత వికలాంగులుగా మారిన వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, మానసిక వేదన, కుటుంబంపై పడిన తీవ్ర ప్రభావాన్ని ప్రజలకు, వాహనదారులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరూ మద్యం సేవించి వాహనం నడపకుండా, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ తమ కుటుంబాలను, సమాజాన్ని సురక్షితంగా ఉంచాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ఆర్టీఓ గోపీనాథ్, పోలీస్ అధికారులు, డాక్టర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

## లక్ష్య సాధనకు అంకితభావం అవసరం

**- మందమర్రి ఏరియాను సందర్శించిన ఆర్ అండ్ డి (కార్పొరేట్) అధికారి సిహెచ్. వెంకటరమణ**

మందమర్రి, జనవరి 20, ప్రభాతవార్త

మందమర్రి ఏరియాను రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (కార్పొరేట్) అధికారి సి. హెచ్. వెంకటరమణ సందర్శించారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణతో కలిసి కేకే ఓసీ గనిని పరిశీలించి, అక్కడ జరుగుతున్న కార్యకలాపాలపై అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని సందర్శించిన సి. హెచ్. వెంకటరమణను ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సి. హెచ్. వెంకటరమణ మాట్లాడుతూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ప్రతి ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేసినప్పుడే లక్ష్య సాధన సులభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జి. ఎల్. ప్రసాద్, డీజీఎం పర్సనల్ సిహెచ్. అశోక్, ఐఈడీ డీజీఎం కిరణ్ కుమార్, అకౌంట్స్ డీజీఎం ఆర్. వి. ఎస్. ఆర్. కే. ప్రసాద్, ఏరియా సర్వే ఆఫీసర్ డీజీఎం దేశాయి, డివైఎస్సీ ఈ అండ్ ఎం (పర్చేస్) బాబు, పర్యావరణ అధికారి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో బొమ్మల కొలువు

జైపూర్, జనవరి 20, ప్రభాతవార్త

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో మంగళవారం లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డైరెక్టర్ సూర్యనారాయణ సతీమణి మాలతి, డైరెక్టర్ వెంకటేశ్వర్లు సతీమణి విజయలక్ష్మి, డైరెక్టర్ తిరుమల రావు సతీమణి పద్మలు ముఖ్య అతిథులుగా, హాజరవగా, ఎస్టిపిపి ఈడి చిరంజీవి సతీమణి శివ కుమారి, ఎస్టిపిపీ జిఎం నరసింహ రావు సతీమణి ఆశ, జిఎం మదన్మోహన్ సతీమణి విజయలక్ష్మి, లేడీస్ క్లబ్ సెక్రెటరి నీలిమ పంతులా లేడీస్ క్లబ్ మహిళలు, పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ముందుగా వారు జ్యోతి ప్రజలను చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజలు సంప్రదాయంగా నిర్వహించే బొమ్మల కొలువు వేడుకలు ఇప్పటికీ ఏమాత్రం వన్నె తగ్గకుండా మహిళలందరూ ఉత్సాహంగా నిర్వహించుకోవడం ఆనందదాయకంగా ఉన్నదని అన్నారు. బొమ్మల కొలువు మన పూర్వీకుల నుంచి వచ్చిన గొప్ప సాంప్రదాయమని అన్నారు. భవిష్యత్తులో కూడా ముందు తరలివారరు కొనసాగించేలా చూడాలన్నారు. ఈ వేడుకలలో భాగంగా మహిళలందరూ లేడీస్ క్లబ్ ఆవరణలో వేసిన రంగవల్లులు, ఆకట్టుకున్నాయి. సీతారాముల ఉత్తరద్వారా దర్శనం, శ్రీ వెంకటేశ్వర స్వామి మూలా విరాట్ రూపం, వెంకటేశ్వర స్వామి వారి అష్టదళ పాదపద్మములు, తిరుప్పావడం, సహస్ర దీపాలంకరణ సేవ, నిత్య కళ్యాణం వంటివి చాలా చక్కగా అలంకరించడం అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం లేడీస్ క్లబ్ మహిళలు మహాభారతంలోని కొన్ని సన్నివేశాలను నాటిక రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాలతి-సూర్యనారాయణ, విజయలక్ష్మి-వెంకటేశ్వర్లు, పద్మ-తిరుమల రావు, శివకుమారి-చిరంజీవి, ఆశ-నరసింహారావు, విజయలక్ష్మి-మదన్మోహన్, వర్క్ షాప్స్ జి. ఎం సతీమణి సుమిధ-శ్రీనివాసులు, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియా జిఎంల సతీమణులు ఉమారాణి-శ్రీనివాస్, శ్రీవాణి-రాధాకృష్ణ, పద్మ-విజయభాస్కర్ రెడ్డి, క్లబ్ సెక్రెటరి నీలిమ పంతులా, స్రవంతి వేణుగోపాల్ ఇతర లేడీస్ క్లబ్ మహిళలు పాల్గొన్నారు.





## వసంత పంచమి సందర్భంగా శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో సామూహిక అక్షరాభ్యాసం

**- జనవరి 23న ఉచితంగా అక్షరాభ్యాస మహోత్సవం నిర్వహణ**

**- శ్రీ సరస్వతి విద్యాపీఠం వారి ఆధ్వర్యంలో**

మందమర్రి, జనవరి 20, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల నందు ప్రతి సంవత్సరం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం ఈ సంవత్సరం కూడా ఘనంగా జరగనుంది. ఈ మేరకు జనవరి 23వ తేదీన, వసంత పంచమి సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. అక్షరాభ్యాసం చేయించుకోవాలనుకునే తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అక్షరాభ్యాసం చేయించుకోవాలనుకునే చిన్నారుల పేర్లను ముందుగా పాఠశాలలో నమోదు చేసుకోవాలని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రిన్సిపాల్ కట్ల శిరీష తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ అధ్యక్షులు బండారు సూరిబాబు మాట్లాడుతూ, వసంత పంచమి రోజు విద్యాదేవత శ్రీ సరస్వతి మాత జన్మదినం కావడంతో ఈ విశిష్ట పర్వదినమున అక్షరాభ్యాసం చేయించుకున్న పిల్లలకు మంచి విద్యాబుద్ధులు, ఉజ్వల భవిష్యత్తు కలుగుతాయని అన్నారు. పాఠశాల కార్యదర్శి దాసరి రాములు మాట్లాడుతూ, వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం చేసుకునే పిల్లలకు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఫోటోతో పాటు కుంకుమ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తిగా ఉచితం అని, దీనికి అవసరమైన పూర్తి సహకారాన్ని కళ్యాణ్ సూపర్ మార్కెట్ యాజమాన్యం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని తల్లిదండ్రులందరూ వినియోగించుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 9059777209, 9014599910, 9849631795.

## వీధి కుక్కల దాడిలో

# ముగ్గురికి గాయాలు

**- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘటనలు**

**- ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి**

లక్షెట్టిపేట, జనవరి 20, ప్రభాతవార్త

వీధికుక్కల దాడులు ఓ సమస్యగా మారింది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. కుక్కల దాడిలో అనేక మంది తీవ్రంగా గాయపడుతున్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని14 వార్డు కాలనీకి చెందిన ఇమ్రాన్, అద్విత్, ఆన్వి పై కుక్కలు దాడి చేయగా గమనించిన కుటుంబీకులు స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి తరలించి చికిత్స అందించారు. కాగా ఈ ఘటనలో తీవ్ర గాయాలైన ఇమ్రాన్‌ని మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుక్కలు ఎప్పుడూ ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తాయో అని కాలనీ వాసులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. కుక్కలు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ ప్రజలపై దాడులు చేసి గాయపారుస్తున్నాయి. దీంతో ప్రజలు బయటకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కుక్కల దాడులు పెరిగిపోతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉందని ఫిర్యాదు చేస్తున్న అధికారులు స్పందించడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానిస్తున్న మంత్రి వివేక్

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ వార్డ్ సభ్యులు

**రామకృష్ణాపూర్, జనవరి 20, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఒకటో వార్డ్, 20వ వార్డ్‌లకు చెందిన మాజీ వార్డ్ సభ్యులు, పలువురు నాయకులు మంగళవారం చెన్నూర్ క్యాంపు కార్యాలయంలో డి.సి.సి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఒకటో వార్డ్ నుండి మాజీ వార్డ్ మెంబర్ తీగల రమేష్, టి.బి.జి.కె.ఎస్ నాయకులు రాస సంపత్, దొమ్మటి కుమార స్వామి, బి.ఆర్.ఎస్ నాయకుడు పులి శ్రీనివాస్, 20వ వార్డ్ నుండి కూతురు ప్రభాకర్, ఆడెపు కృష్ణ కుమార్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరగా మంత్రి వివేక్ వెంకట స్వామి వారికి పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డ్ ఎన్నికల ఇంచార్జ్ గాండ్ల సమ్మయ్య,కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఓడ్నాల శ్రీనివాస్,మహంకాళి శ్రీనివాస్, పార్వతి విజయ,బత్తిని రవి, పందిన కృష్ణ, గాజుల శంకర్, ముక్తి శ్రీనివాస్, ఎండి గౌస్‌లు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన భూక్య జాన్సన్ నాయక్

**జన్నారం, జనవరి 20, ప్రభాతవార్త**

జన్నారం మండలం రాంపూర్ గ్రామంలో ఆదివారం మరణించిన తండ్రి పాలగాని భూమయ్య కుమారుడు కార్తీక్ కుటుంబాన్ని బి ఆర్ ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. అలాగే తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుందారపు లక్ష్మి నారాయణ కుటుంబాన్ని పరామర్శించి ఇరు కుటుంబాలకు చాలా మనోధైర్యంగా ఉండాలని అధైర్యపడొద్దని, ఏ సమస్య వచ్చిన మా దృష్టికి తీసుకువస్తే సహాయ సహకారాలు అందిస్తామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందచేత

**తాండూర్, జనవరి20, ప్రభాతవార్త :**

మండలం కాసిపేట గ్రామానికి చెందిన చీర్ల లస్మయ్య, గొర్లపల్లి కృష్ణకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం గ్రామ సర్పంచి ముదాం వనజ అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గోవర్ధన్, మాజీ సర్పంచ్ ఆస్ప రమేష్, నాయకులు కొండు రమేష్, రుకుం సంతోష్, బోయిని కిరణ్, చీర్ల మల్లేష్, గొర్లపల్లి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న సర్పంచ్ ముదాం వనజ

### సర్పంచ్‌లు గ్రామ పరిపాలనపై

# సమగ్ర అవగాహన కలిగి ఉండాలి

**- డిపిఓ వెంకటేశ్వర్ రావు**

**హాజీపూర్, జనవరి 20 ప్రభాతవార్త**

నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామ పరిపాలన పై సమగ్ర అవగాహనా కలిగి ఉండాలని డి.పి.ఓ వేంకటేశ్వర్ రావు అన్నారు. ముల్కల్లాలోని ఐజా కాలేజీలో నూతన సర్పంచ్‌లకు రెండవ రోజు కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్బంగా డిపిఓ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పంచాయతీ రాజ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని, ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు గ్రామ పాలన, అభివృద్ధి, ప్రజాసేవ విధానాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. గ్రామస్థాయిలో ప్రజల ఆశయాలను నెరవేర్చే ప్రధాన బాధ్యత సర్పంచ్‌లదే. అందుకే వారు ప్రభుత్వ పథకాలు, ఆర్థిక వ్యవస్థ, పాలనా విధానాలు, నిబంధనలు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలలో పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండటం అత్యంత అవసరం. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా సర్పంచ్‌లు గ్రామ అభివృద్ధిని సమర్థవంతంగా నడిపించడానికి కావలసిన నైపుణ్యాలు, జ్ఞానం అందించబడుతుంది. శిక్షణలో చర్చించబోయే ప్రఈ శిక్షణా కార్యక్రమం సర్పంచ్‌లకు వారి బాధ్యతలను మరింత స్పష్టంగా అర్థమయ్యేలా చేసి, గ్రామ పాలనలో నూతన దృక్పథంతో ముందుకు సాగేందుకు దోహదపడుతుంది. కావున సంబంధిత మండలాలకు చెందిన సర్పంచ్‌లు అందరూ నిర్ణయించిన తేదీ, సమయం, స్థలంలో తప్పనిసరిగా హాజరుకావలసిందిగా ఈ శిక్షణా కార్యక్రమం గ్రామాభివృద్ధికి అత్యంత కీలకమైనది కావున, ఎవ్వరూ కూడా గైర్హాజరు కాకుండా జిల్లా పంచాయతీ అధికారి ప్రసంగిస్తూ శిక్షణా కేంద్రంలో అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయబడినవి. భోజనం, త్రాగునీరు, రాత్రి బస సదుపాయం మొదలైనవి అందుబాటులో ఉంటాయని తెలుపడం జరిగినది. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి కె. సతీష్, చెన్నూర్ మండల ఎంపీడీఓ మోహన్, హాజీపూర్ ఎంపీడీఓ సాయి వెంకట రెడ్డి, మండల పంచాయతీ అధికారులు శ్రీపతి బాపు రావ్, జి. అనిల్, వి. శ్రీనివాస్, పి. వెంకటేష్, కె. మహేష్, పంచాయతీ కార్యదర్శులు నరేందర్, సుమన్, నాగరాజు, డిపియం నరేందర్, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది ప్రజ్ఞ, రాంకుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



సర్పంచ్‌ల శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న డిపిఓ వెంకటేశ్వర్ రావు



కలెక్టర్ హరితకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కోవలక్ష్మి

**ఆసిఫాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె. హరితను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్బంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, నెలకొన్న సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతి, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్, నాయకులు నిస్సార్, అహ్మద్, బలరాం,గంధం శ్రీనివాస్,జావీద్, సాజిద్, తాజ్,శంకర్, రవి, సంజీవ్, సత్తన్న, ప్రభాకర్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల దరఖాస్తు గడువు పెంపు

**హాజీపూర్, జనవరి 20, ప్రభాతవార్త**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సాధారణ, బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో అడ్మిషన్ల కోసం నిర్వహించే వీజీ సెట్, 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి నిర్వహించే బ్యాక్‌లాగ్ సెట్ దరఖాస్తు తేదీని జనవరి 21 నుండి జనవరి 25వ తేదీ వరకు పొడిగించినట్టు, ఈ అ వకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్హులైన పేద, మధ్య తరగతి విద్యార్థినీ విద్యార్థులు అవసరమైన అన్ని సర్టిఫికెట్ లతో ఆన్ లైన్ ద్వారా గాని లేదా సమీప మీ సేవ కేంద్రాల ద్వారా గాని దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 22వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన కేంద్రాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

**తాండూర్, జనవరి 20, ప్రభాతవార్త**

ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ మండలం గోపాల నగర్ సర్పంచ్ గాట్ల నరసయ్య కోరారు. గ్రామపంచాయతీ పరిధిలో మంజూరైన ఉపాధి హామీ పనులకు మంగళవారం సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాజుల సునిత, ఫీల్డ్ అసిస్టెంట్ ఎమ్మర్ల రాజయ్య, వార్డు సభ్యులు గాజ్జెల గోవర్ధన్, కూలీలు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను ప్రారంభించిన సర్పంచ్ గాట్ల నరసయ్య

## బాధితులకు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అందజేత

**తాండూర్, జనవరి 20, ప్రభాతవార్త :**

సిఈఐఆర్ పోర్టల్ సహాయంతో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ను మంగళవారం బాధితులకు మాదారం ఎస్సై సౌజన్య అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ కు చెందిన చిలువేరి సాయికిరణ్, రేపల్లెవాడ గ్రామానికి చెందిన ఉరడి సాయికుమార్ లు మొబైల్ ఫోన్లను పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో ట్రైస్ చేసి బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను స్వాధీనం తీసుకొని బాధితులకు అందజేశామని ఎస్సై తెలిపారు.



బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న ఎస్సై సౌజన్య

### మంచిర్యాల కార్పొరేషన్ ఎన్నికల్లో

# కాంగ్రెస్-సీపీఐ సీట్ల అవగాహనకు భట్టి హామీ

**మంచిర్యాల, జనవరి 20, ప్రభాతవార్త**

కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఇరు పార్టీలు కలిసి పని చేయాలని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క త్వరలో ఎన్నికలు జరగనున్న మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కోల్‌బెల్ట్ ప్రాంతంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీల మధ్య సీట్ల అవగాహన అంశంపై సానుకూల వాతావరణం కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు సీపీఐ నాయకులకు హామీ ఇచ్చారు. ఈ విషయమై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తాను స్థానిక శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుతో చర్చించి, రెండు పార్టీల మధ్య సమన్వయంతో ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో జరిగిన భేటీలో మున్సిపల్ ఎన్నికల సర్దుబాటు అంశంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవైన శంకర్‌లు చర్చించారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇరు పార్టీల మధ్య కొనసాగిన అవగాహన, స్నేహపూర్వక సంబంధాలను ప్రజల ఆకాంక్ష మేరకు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లోని కోల్‌బెల్ట్ ప్రాంతంలో సీట్ల అవగాహన అంశంపై



ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందిస్తూ, ఈ అంశాన్ని తప్పకుండా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుతో చర్చించి, కాంగ్రెస్-సీపీఐ పార్టీల మధ్య పరస్పర అవగాహనతో కలిసి పని చేసేలా చర్యలు తీసుకుంటామని సీపీఐ నాయకులకు స్పష్టం చేశారు.


టి ఎల్ ఎం ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

## ఆకట్టుకున్న విద్యార్థుల టిఎల్ఎం మేళ

**తాండూర్, జనవరి 20, ప్రభాతవార్త :**

మండలంలోని అచ్చలాపూర్ జెడ్పిహెచ్ఎస్ లో మంగళవారం విద్యార్థులు హిందీ బోధన అభ్యసన సామాగ్రి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరవ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు తయారు చేసిన టిఎల్ఎం అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, హిందీ సహ ఉపాధ్యాయుడు సురేందర్ మాట్లాడుతూ హిందీ భాష పై మక్కువ, ప్రాముఖ్యతను పెంపొందించడం, హిందీ భాషను సరళంగా మాట్లాడడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమన్నారు. టిఎల్ఎంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు

**ఆసిఫాబాద్, జనవరి 20, ప్రభాతవార్త :**

మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక వాసవి కన్యక పరమేశ్వరి ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షుడు మర్యాల ఉదయబాబు మాట్లాడుతూ ముగ్గుల పోటీలో 31 మంది పాల్గొన్నారన్నారు. పండగ సంస్కృతి, రంగులు, డిజైన్ వంటి అంశాలను పరిగణలోకి తీసుకోని ముగ్గురు న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. సీనియర్ విభాగంలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు జూనియర్ విభాగంలో సైతం తొలి మూడు స్థానాలకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిలివేరి వెంకటేశ్వర్లు, రావుల వెంకన్న, న్యాయ నిర్ణేతలు సాయిని శ్రీదేవి, జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

## అధ్యాపకున్ని నియమించాలని కోరుతూ విద్యార్థుల వినతి

**బెజ్జూర్, జనవరి 20, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకుడు లేక విద్యార్థులు చదువుకు దూరమైపోతున్నారు. వచ్చే నెలలో ప్రాక్టికల్ పరీక్షలు ఉండగా ప్రిపరేషన్ కాలేదని రికార్డులు కూడా పూర్తి చేయలేదని దీంతో పరీక్షల్లో అనుత్తీర్ణులు అయ్యే అవకాశం ఉందని విద్యార్థులు ఆవేదన చేయుచున్నారు. విద్యార్థులు బుధవారం తమకు అధ్యాపకుని నియమించి సమస్య పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేస్తూ ర్యాలీగా తహసిల్దార్ కార్యాలయం వరకు వెళ్లారు. ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం విద్యార్థులు డిప్యూటీ తహసిల్దార్ భీమ్లా నాయక్ వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వారికి సంఘీభావంగా నాయకులు జావిద్ అలీ ఖాన్ పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందిస్తున్న విద్యార్థులు

## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 20, ప్రభాతవార్త:**

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన వచ్చినట్లు ఫౌండేషన్ అధ్యక్షులు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన 41 మందిని పరీక్షించగా అందులో 21 మందికి ఆపరేషన్ అవసరమని వారికి విడతల వారిగా ఆపరేషన్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రతి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, కంటి శుక్లాలు ఉన్నవారు, కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

**తిర్యాని, జనవరి 20, ప్రభాతవార్త:**

తిర్యాని మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి అనీల్ తెలిపారు. బుధవారం ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, 22న ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, 23న బ్యాక్ లాగ్ విద్యార్థులకు నైతిక విద్య, మానవ విలువలు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా 24న రోజున ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. పై పరీక్షలు అన్నింటికీ విద్యార్థులు తప్పకుండా హాజరుకావాలని లేనిచో వారు పొందే మార్కుల మెమోలో ఫెయిల్ అని వస్తుందని దీంతో ఆ సర్టిఫికెట్ భవిష్యత్తులో చెల్లదని కాబట్టి విద్యార్థులందరూ హజరు కావాలని ఆయన తెలిపారు.


వాసవి మాతకు అభిషేకం నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులు, భక్తులు

## భక్తిశ్రద్ధలతో వాసవి మాత ఆత్మర్పణ దినోత్సవం

**ఆసిఫాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:**

వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవంను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక వాసవి మాత ఆలయంలో వాసవి క్లబ్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రాజశేఖర్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్, సభ్యులు రావుల వెంకన్న, మురళి, పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షుడు చిలివేరి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు గుండా బాలేష్, క్లబ్ అంతర్జాతీయ నాయకులు గంధం శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ బాబు, శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, మాజీ అధ్యక్షుడు పాత శ్రీనివాస్, ఆర్యవైశ్యులు కోడిప్యాక వేణుగోపాల్, కాచం వినేష్, గంధం వినోద్, గుండా వెంకన్న, గుండా నగేష్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

**కెరమెరి జనవరి 20 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ మారుమూల ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో సీఎం కప్ క్రీడ పోటీలను నిర్వహిస్తుందని కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు అన్నారు. మంగళవారం కెరమెరిలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గ్రామపంచాయతి స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీఓ సురేష్ కుమార్, ఎంఈవో ఆడే ప్రకాష్, తహసీల్దార్ సంతోష్ లతో కలిసి ప్రారంభించారు. యువత క్రీడల వైపు ఆకర్షితులవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. ఈ పోటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ ప్రదర్శించే అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సర్పంచ్, ఉప సర్పంచ్ లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఆర్ఐ పవన్, పీడీ మహేష్, యోగ ట్రైనర్ దినేష్, కారోబార్ గడ్డల వెంకన్న, నాయకులు పెందోర్ శ్రీనివాస్, వినేష్, రాంచందర్, ముజిబ్, సలీమ్ తదితరులు ఉన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్

## అనారోగ్యంతో మృతి చెందిన హోం గార్డ్ రామ్‌షాకు పోలీస్ శాఖ నివాళులు

**తిర్యాని, జనవరి 20, ప్రభాతవార్త:**



తిర్యాని మండలంలోని గుడిపేట గ్రామానికి చెందిన ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో హోం గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న కుడ్మేత రామ్‌షా (39) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితిక పంత్ రామ్‌షా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ మంగళవారం గుడిపేటకు చేరుకుని రామ్‌షా భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 2007 సంవత్సరంలో పోలీస్ శాఖలో హోం గార్డ్‌గా చేరిన రామ్‌షా విధి నిర్వహణలో అంకితభావంతో సేవలు అందించారని అధికారులు గుర్తు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అంత్య క్రియల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10వేలను రామ్‌షా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చిత్తరంజన్ కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ (హోం గార్డ్స్) విద్యాసాగర్, రెబ్బెన సీఐ సంజయ్, తిర్యాని ఎస్సై వెంకటేష్, హోం గార్డ్స్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## క్షయ నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది

### - డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధాకర్ నాయక్

**జన్నారం, జనవరి 20, ప్రభాతవార్త**

రాష్ట్రం లోని అన్ని గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది అని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధాకర్ నాయక్ అన్నారు. మంచిర్యాల జిల్లా టీబీ ప్రోగ్రామ్ అధికారి డా. సుధాకర్ నాయక్ ఆదేశానుసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ఉమాశ్రీ, డా. లక్ష్మి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రోటిగూడ, చింతగూడ గ్రామాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. డా. సుధాకర్ నాయక్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ క్షయ నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను గ్రామ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బాధితులకు ఉచితంగా రోటిగూడ లో 40 మందికి ఎక్స్ రే, 15 మందికి థెమడ పరీక్షలు, చింతగూడ లో 75 మందికి ఎక్స్ రే, పదిమందికి థెమడ పరీక్షలు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పంచాయితి సెక్రటరీ, ఎస్ టి ఎస్ బి. సురేష్, ఎక్స్ రే టెక్నీషియన్ అజయ్, హెల్త్ అసిస్టెంట్లు కమలాకర్, రషీద్ ఖాన్, ఏఎన్ఎంలు బి.రాజేశ్వరి, పద్మ, ఎంఎల్‌హెచ్‌పీలు సంధ్య, నవనీల, ఆశాలు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**తాండూర్, జనవరి 20, ప్రభాతవార్త :**

మండలంలోని కిష్టంపేట గ్రామ పంచాయతీకి చెందిన రేకుల భీమక్కకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కును మంగళవారం కిష్టంపేట సర్పంచ్ సార్ల తిరుపతి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కామన్ శ్రీనివాస్, నాయకులు ఒడ్నాల సత్యనారాయణ, ఎడిగి సంతోష్, బియ్యాల నిచల్, తోట తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



# మైనారిటీ గురుకులాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జనవరి 20, ప్రభాతవార్త**

జిల్లాలోని మైనారిటీ గురుకుల విద్యాసంస్థలలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో గురుకుల విద్య సంస్థలలో ప్రవేశాలకు సంబంధించిన గోడ ప్రతులను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనారిటీ గురుకుల విద్యా సంస్థలలో 5వ తరగతి నుండి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు ప్రవేశాల కొరకు మైనారిటీ విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు ఆన్‌లైన్‌లో tgmreistelangana.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు పొందవచ్చుని, వివరాల కొరకు కంట్రోల్ రూమ్ నం.7331170790లో సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ




కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎండి. తాహేరుద్దీన్, అకాడమీ సమన్వయకర్త రిజ్వాన్, మంచిర్యాల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ మందపెల్లి సంధ్య, చెన్నూర్ పాఠశాల ప్రిన్సిపల్ గోపి, కళాశాల ప్రిన్సిపల్ సమ్మయ్య, బెల్లంపల్లి ప్రిన్సిపల్ నీలు తదితరులు పాల్గొన్నారు.



జవాన్‌ను సన్మానిస్తున్న బలరాం జాదవ్

## జవాన్‌ను సన్మానించిన బలరాం జాదవ్

**నేరడిగొండ, జనవరి 20, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన వీరేందర్ ఇటీవల విడుదలైన సీఐఎస్ఎఫ్ కేంద్ర ప్రభుత్వ పారామిలిటరీ దళం పరీక్ష ఫలితాల్లో జవాన్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ వీరేందర్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బలరాం జాదవ్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి యువకులు దేశ సేవకు సైనికులుగా ఎంపిక కావడం ఆనందకరమన్నారు. ముఖ్యంగా నేరడిగొండ మండలంలో తాను చదువు చెప్పిన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో సైనికులుగా ఎంపిక కావడం తనకు గర్వకారణమని పేర్కొన్నారు. దేశ భద్రతకు యువత అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆయన తెలిపారు.



సర్పంచ్‌లను సన్మానిస్తున్న సహజ్యోతి మండల సమైఖ్య సభ్యులు

## నూతన సర్పంచ్‌లకు సన్మానం

**బజార్‌హత్నూర్, జనవరి 20, ప్రభాతవార్త:**

మండలంలోని నూతనంగా ఎన్నికైన మహిళా సర్పంచ్‌లకు సహజ్యోతి మండల సమైఖ్య ఆద్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపిఎం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల నుండి చైతన్యం పొంది, పురుషులతో సమానంగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అలాగే మును ముందు తమ తమ గ్రామాలను ఆదర్శ గ్రామ పంచాయితీలుగా తీర్చి దిద్ది, మండలానికి గుర్తింపు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఏపిఎం జి వెంకటరెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పి గంగా సాగర, కార్యదర్శి కనక సరోజా, ఎస్‌విఈపి బ్లాక్ ఏపీఎం పి గణేష్, సీసిలు, విఓ లీడర్స్, విఓఎలు, ఎస్‌విఈపి, సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

## డిపేన్సీవ్ డ్రైవింగ్ పై వాహనదారులకు అవగాహన కల్పించిన పోలీసులు

**దిలావర్‌పూర్, జనవరి 20, ప్రభాతవార్త:**

పొంచి ఉన్న ప్రమాదాలను గమనిస్తూ అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని ఏఎస్ఐ భీమ్రావు అన్నారు. మంగళవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు వాహనదారుల్లో భద్రత అవగాహన పెంపొందించేందుకు డిపేన్సీవ్ డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలను నడుపుతున్న సమయంలో సెల్ ఫోన్ మాట్లాడరాదని, మూలమలుపు వంటి వాటిని గమనిస్తూ ఉండాలని, రోడ్డుపై ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని ఎదుర్కొంటూ ముందుకు సాగాలని తెలిపారు. దీని ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చుని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పరధ్యానంగా ఉండి నడపవద్దని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ వాహనాలని డ్రైవింగ్ చేయాలని తెలిపారు. ఇందులో పోలీస్ సిబ్బంది వాహనదారులు ఉన్నారు.




## పండగల ప్రారంభమైన సీఎం కప్ పోటీలు

**దిలావర్‌పూర్, జనవరి 20, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్, సిర్గాపూర్ క్లస్టర్‌ల వారీగా మంగళవారం సీఎం కప్ పోటీలను ఎంపీఓ గోవర్ధన్, ఎంఈఓ సదానందం ప్రారంభించారు. విద్యార్థులు ఈ క్రీడలను సద్వినియోగం చేసుకొని తమలో దాగి ఉన్న నైపుణ్యాలను బయటకు తేవాలని పేర్కొన్నారు. లోలం మాయాపూర్ కాల్వ మడేగాం గ్రామాలలో గెలుపొందిన విద్యార్థులు మండల స్థాయిలో ఆడుతారని, మండల స్థాయిలో గెలిచినవారు జిల్లా స్థాయిలో ఆడుతారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 285 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వ్యాయామ ఉపాధ్యాయుడు అంబాజీ తెలిపారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రయత్నం చేయాలని కోరారు. ఇందులో గ్రామ సర్పంచులు సూరత్ శ్రీలత, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



# బాధ్యతాయుత ప్రవర్తనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

## - జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం ప్రభాకర్ రావు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం ప్రభాకర్ రావు

**ఆదిలాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:**

బాధ్యతాయుత ప్రవర్తనతోనే రోడ్డు ప్రమాదాల నివారించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం ప్రభాకర్ రావు అన్నారు. మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, వాహనదారులు, డ్రైవర్లు, డ్రైవర్ యూనియన్లు, వ్యాపారస్తులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "అరైవ్ అలైవ్" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం ప్రభాకర్ రావు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరిస్తూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, విద్యార్థులు రోడ్డు భద్రతపై నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రులకు తెలియజేసి అవగాహన పెంచాలని తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను 20 శాతం వరకు తగ్గించడం లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని, లైసెన్స్ పొంది మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. ట్రిబుల్ రైడింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్‌ను పూర్తిగా నివారించాలని అన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రాణం తిరిగి రానిదని గుర్తుంచుకుని ప్రజలు వాహనాలు నడపాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను అభినందించారు. హాట్‌స్పాట్‌ల వద్ద తనిఖీలు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు, జిగ్‌జాగ్ డ్రమ్స్ ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. మండలాల వారిగా లైసెన్స్ మేళాలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈరోజు నుంచి 10 రోజులపాటు జిల్లావ్యాప్తంగా పలు ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా పోలీసు శాఖ తెలిపింది. ప్రజలు, వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, జిల్లా అదనపు సెషన్స్ న్యాయమూర్తి సీఎం రాజ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, పరిపాలన ఏఎస్పి పి మోనిక ఐపిఎస్, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండ్రాల నగేష్, పీపీ సంజయ్ వైరాగరి, డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ డిసిసి చైర్మన్ అడ్డి భోజరెడ్డి, ఐఎంఏ ఆదిలాబాద్ అధ్యక్షుడు కళ్ళెం వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుజాత, కళాశాల విద్యార్థులు, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు, డ్రైవర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పోలీసు సిబ్బంది పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యకరమైన జీవితానికి స్వచ్ఛమైన నీరు ప్రధానం

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**నార్నూర్, జనవరి 20, ప్రభాతవార్త:**

ప్రజల ఆరోగ్యకరమైన జీవితానికి స్వచ్ఛమైన నీరు ప్రధానమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్ సమీపంలో నాంది ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితానికి స్వచ్ఛమైన నీరు ప్రధానమని, నాంది వాటర్ సంస్థ సౌజన్యంతో సుమారు రూ.11.61 లక్షలతో నూతన వాటర్ ప్లాంట్ ను ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నెలకొల్పడం జరిగిందని అన్నారు. అత్యాధునిక_శ్కిల్ల సాంకేతికతతో ఎటువంటి రసాయనాలు వాడకుండా నీరు శుద్ధి అవుతుందని, ప్రతి నెలా నీటి నాణ్యత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆస్పిరేషనల్ బ్లాక్ కింద నార్నూర్ మండలాభివృద్ధికి మొత్తం 2.78 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మండల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగం, నాంది వాటర్ సిఈఓ దివ్య, సర్పంచ్ బానోత్ కావేరి, మాజీ సర్పంచ్ గజానంద్ నాయక్, ఉప సర్పంచ్ మహమ్మద్ ఖురేషి, పంచాయతీ కార్యదర్శి మొతిరాం,గ్రామ ప్రజలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డుకు అడ్డుగా వ్యాపారాలు కట్టడి చేయాలి

**ఇచ్చోడ, జనవరి 20, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారాలు రోడ్డు వరకు విస్తరించడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతూ ప్రమాదాల ముప్పు పెరుగుతోందని సహారా జీప్ డ్రైవర్స్ ఓనర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఈ సమస్యను నివారించాలని కోరుతూ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ పాషా ఆధ్వర్యంలో ఆర్టీవో ప్రదీప్ కుమార్, ఇచ్చోడ సీఐ బండారి రాజు, గ్రామ సర్పంచ్ కొడప జలై జాకుకు వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో దుకాణదారులు తమ పరిధిని దాటి రోడ్డు వరకు సామాన్లు పెట్టి వ్యాపారం నిర్వహిస్తున్నారని తెలిపారు. కొందరు దుకాణ యజమానులు అదనంగా రెండు మూడు వ్యాపారాలకు అనుమతి ఇచ్చి కిరాయిలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల గ్రామపంచాయతీకి ఎలాంటి ఆదాయం రాకుండా పోవడమే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు. కాబట్టి రోడ్డుకు ఇరువైపులా రోడ్డు వరకు వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులను కట్టడి చేసి, రహదారిపై ట్రాఫిక్ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ నంబర్ దూట రాజేశ్వర్, ఏఎంవీఐ శ్వేత, సహారా జీప్ డ్రైవర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చాహకటి కృష్ణ, ప్రధాన కార్యదర్శి వాగ్మారే చరణ్, ఐచర్ డ్రైవర్స్ ఓనర్స్, పికప్ వాహనాల ఓనర్స్ డ్రైవర్లు, మన్నూర్ గుడిహత్నూర్ అడ్డాల డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు టోల్ ఫ్రీ నెంబర్

**సారంగాపూర్, జనవరి 20, ప్రభాతవార్త:**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలపై ఫిర్యాదు కోసం కేంద్ర ప్రభుత్వం 1800 2001001 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసింది. వేతనం చెల్లించక పోయిన, పని చేసే దగ్గర వసతులు కల్పించకపోయినా, జాబ్ కార్డు సమస్యలు ఉన్న పైనంబర్‌కు ఫిర్యాదు చేయాలని, ఇది 24 గంటలు అందుబాటులో ఉంటుంది. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం కొరింది.



వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

# అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంలో పత్రికల పాత్ర కీలకం

## - సర్పంచ్ గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి

## - వార్త క్యాలెండర్ ఆవిష్కరణ

**నర్సాపూర్(జి), జనవరి 20, ప్రభాతవార్త:**

అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంలో పత్రికల పాత్ర కీలకమని సర్పంచ్ గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వార్త పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, ఉపసర్పంచ్ గాడి ప్రభాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, వార్డ్ సభ్యులు, స్థానిక నాయకులు మజర్, గంగాధర్, గంగారాం సుదర్శన్ గౌడ్, పత్రిక విలేకరి గంగాధర్ పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి

**జైనూర్, జనవరి 20, ప్రభాతవార్త:**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ఈనెల 21న నిర్వహించబోయే విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఏడిఈ డి శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. బుధవారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబోయే విద్యుత్ సమస్యల పరిష్కార కార్యక్రమానికి సిజిఆర్ఎఫ్ చైర్మన్ నారాయణ, సిజిఆర్ఎఫ్ మెంబర్స్ రామకృష్ణ, కిషన్, రాజగౌడ్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. జైనూర్ మండల కేంద్రంగా నిర్వహించబోయే ఈ కార్యక్రమానికి జైనూర్ కెరామెరి, తిర్యాని, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల విద్యుత్ వినియోగదారులు హాజరై తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోగలరని ఆయన కోరారు.

# బిఎంఎస్‌లో చేరిన సెక్యూరిటీ ఉద్యోగులు

## - హక్కుల సాధనకు కృషి చేస్తామని యాదగిరి సత్తయ్య వెల్లడి

**నస్పూర్, జనవరి 20, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో మంగళవారం ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ యూనియన్ల నుంచి పలువురు సెక్యూరిటీ విభాగం ఉద్యోగులు బిఎంఎస్‌లో చేరారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్‌బిఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. సింగరేణి సంస్థ ఆస్తులను కంటికి రెప్పలా కాపాడుతున్న సెక్యూరిటీ ఉద్యోగులు సైనికులతో సమానమని ఆయన కొనియాడారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సెక్యూరిటీ విభాగం డెసిగ్నేషన్ మార్పు కోసం తమ సంఘం గట్టిగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కార్మికులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేలా కొత్త క్యాడర్ స్కీమ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఉద్యోగులకు సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్లుగా పదోన్నతులు కల్పించే అంశాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సింగరేణి విస్తరణకు ఆరు జిల్లాల్లో అపారమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, నూతన గనుల అన్వేషణ ద్వారానే సంస్థ పురోగతి సాధ్యమని పేర్కొన్నారు. సింగరేణిని నిర్వీర్యం చేసే కుట్రలను కార్మికులు సమైక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత కోసం బిఎంఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, పిట్ కార్యదర్శి కొమ్ము బాపు, జాయింట్ సెక్రెటరీలు బోయిన మల్లేష్, కట్టుకూరి సతీష్, రాజారాం కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జల్ల తిరుపతి, బుర్ర అరుణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బిఎంఎస్‌లో చేరిన ఉద్యోగులను కండువాతో ఆహ్వానిస్తున్న యాదగిరి సత్తయ్య

# వేలాదిగా తరలివచ్చిన భక్తులు

## - గురుపాదుకల దర్శనంతో చింతలమానేపల్లి భక్తిమయం



సేవాభావంలో భాగంగా కుట్టు మిషన్ల పంపిణీ


గురుపాదుకల శోభాయాత్రలో పాల్గొన్న వేలాది భక్తులు

**చింతలమానేపల్లి, జనవరి 20, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్ పాఠశాల ప్రాంగణంలో జగద్గురు రామానందాచార్య స్వామి నరేంద్ర చార్యాజీ మహారాజ్ గురుపాదుక దర్శనం సమ్మేళనం భక్తుల అధిక సంఖ్యలో హాజరుతో ఘనంగా నిర్వహించారు. మండలంతో పాటు మహారాష్ట్ర పరిసర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి గురుపాదుకలను దర్శించుకుని పునీతులయ్యారు. ఈ గురుపాదుకలను ముందుగా బాలాజీ అంకోడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య-చిన్నక్క నివాసంలో ప్రత్యేక పూజలు మూడు రోజులపాటు నిర్వహించి అనంతరం మండలంలోని కొమరం భీమ్ చౌరస్తా నుంచి మంగళవారం భాజా భజంత్రీలతో గురుపాదుకల శోభాయాత్రను అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ ఊరేగింపులో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్, తల్లి జిజియాబాయి వేషధారణలో గుర్రపు స్వారీలు, సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయుడు వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళా భక్తులు మంగళ హారతులతో పాల్గొని శోభాయాత్రకు మరింత శోభను చేకూర్చారు. మాస్టర్ మైండ్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన వేదికపై పెద్దలు, ముఖ్య అతిథులను సన్మానించగా, సేవాభావంలో భాగంగా పేదవారికి కుట్టు మిషన్లను పంపిణీ చేయడం ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. అనంతరం గురుపాదుకలకు విశేష పూజలు నిర్వహించి, భక్తులందరికీ సక్రమంగా దర్శనం కల్పించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో సుమారు 5000 మంది భక్తులు పాల్గొనగా, వారందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. గురుభక్తి, సేవా తత్వం, సామాజిక బాధ్యత కలిసి ప్రతిబింబించిన ఈ గురుపాదుక దర్శనం సమ్మేళనం చింతలమానేపల్లి మండలంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని వెల్లివిరిసేలా చేసిందని భక్తులు తెలిపారు.



## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

**జన్నారం, జనవరి 20, ప్రభాతవార్త**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణం మాఘ శుద్ధ పాడ్యమి రోజు జరిగింది. మంగళవారం గోదారి నది ఒడ్డున బ్రహ్మకుండం అనే పవిత్ర స్థలంలో ఒక వంద మూడు అగ్ని గుండాలను ఏర్పాటు చేసి వాసవీ దేవి తన అనుచరులతో కలిసి అగ్నిలో దూకి ఆత్మ బలిదానం చేసిన రోజు. వాసవి కన్యకాపరమేశ్వరి దేవిని ఆర్యవైశ్యులు కుల దేవతగా పూజిస్తారు. కావున స్థానిక శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ రోజును పురస్కరించుకొని మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో అభిషేకాలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్న పొన్కల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరికి అమ్మవారి కృపా కటాక్షాలు కలగాలని అందరూ అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో వెల్లి విరిసాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ పూజ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు జక్కు భూమేష్, మల్యాల కిరణ్, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆలయ కమిటీ చైర్మన్ జక్కు సత్తయ్య, భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన చిన్మయి చేత్రిక

**బెల్లంపల్లి, జనవరి 20, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని యువ సంఘటన్ హై స్కూల్‌కు చెందిన మూడో తరగతి విద్యార్థిని చిన్మయి చేత్రిక రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటింది. సోమవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన అథ్లెటిక్ 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో, అండర్-10 విభాగంలో అథ్లెటిక్స్ 60 మీటర్ల పరుగుపందెంలో చిన్నారి చిన్మయి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానాన్ని సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పోటీ పడిన చిన్మయి చేత్రిక అద్భుతమైన వేగం, పట్టుదలతో మూడో స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. చిన్న వయసులోనే ఈ స్థాయి విజయం సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థినికి యువ సంఘటన్ హై స్కూల్ యాజమాన్యం, శారీరక విద్య ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. చిన్మయి చేత్రిక సాధించిన ఈ విజయం బెల్లంపల్లి పట్టణానికి గర్వకారణంగా నిలిచింది.

## బొమ్మల ఆధారిత బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ

**సిరికొండ, జనవరి 20, ప్రభాతవార్త:**

విద్యా వ్యవస్థలో నూతనంగా ప్రవేశపెట్టిన బొమ్మల ఆధారిత బోధన విధానంపై ప్రతి జిల్లా నుంచి ఎంపికైన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణకు ఆదిలాబాద్ జిల్లా తరపున డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్(డీఆర్‌పి)గా పీఎం, ఎస్‌హెచ్‌ఆర్ఐ, ఎంపీపీఎస్ సిరికొండ పాఠశాల ఉపాధ్యాయులు మునేశ్వర్ విజయ్ కుమార్ హాజరయ్యారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉమ్మడి జిల్లా స్థాయిలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలోని అన్ని పీఎం, ఎస్‌హెచ్‌ఆర్ఐ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ రూపంలో అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు మునేశ్వర్ విజయ్ కుమార్

## ఛలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**సిరికొండ, జనవరి 20, ప్రభాతవార్త:**

విద్యాహక్కు చట్టం అమలు తేదీకి ముందు నియామకమైన ఉపాధ్యాయులందరికీ టెట్ నుంచి మినహాయింపు కల్పించాలని, పార్లమెంట్ సమావేశాల్లో టెట్‌పై చట్ట సవరణ చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షులు మూగ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల సోన్పల్లి, ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల రాయిగూడ, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల తదితర పాఠశాలలను ఆయన సందర్శించారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఫిబ్రవరి 5న ఆల్ ఇండియా ఉపాధ్యాయ సంయుక్త ఉద్యమ కార్యాచరణ సమితి (ఏఐజాక్టో) ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది ఉపాధ్యాయులకు తీవ్ర ప్రభావం చూపిన టెట్ అంశంపై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కోరారు. జాతీయ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ నిరక్ష్య ధోరణి కారణంగానే ఈ తీర్పు వచ్చిందన్నారు. ఉపాధ్యాయులు పెద్దఎత్తున నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 51 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, సీపీఎస్ ఉద్యోగులకు 90 శాతం జీపీఎఫ్ ఏరియర్స్‌ను 30 వాయిదాలలో చెల్లించే విధానం అన్యాయమన్నారు. జీపీఎఫ్ వడ్డీరేటు నిర్ణయించి పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. సర్వీస్ రూల్స్ రూపొందించి వేసవి సెలవుల్లో బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలని, హెల్త్ కార్డ్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శంకర్, గుడిహత్నూర్ మండల ప్రధాన కార్యదర్శి దుర్వ వసంత్, నాయకులు రాంకుమార్, గణేష్ పాల్గొన్నారు.



## నూతన సీసీ రోడ్డుకు భూమి పూజ

**బజార్‌హత్నూర్, జనవరి 20, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని పులాజీ బాబా కాలనీలో మంగళవారం సర్పంచ్ సాయన్న, ఉప సర్పంచ్ కొంగర్ల శారద రాజన్న లు 15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు కు భూమి పూజ చేశారు. బీఆర్ఎస్ పార్టీ యువజన సంఘం అధ్యక్షులు డుబ్బుల చంద్ర శేఖర్ మాట్లాడుతూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇచ్చిన హామీ మేరకు పులాజీ బాబా కాలనికి 15 లక్షల నిధులతో సీసీ రోడ్డును మంజూరు చెయ్యడం జరిగిందన్నారు. అలాగే ఎమ్మెల్యే సహాయ సహకారాలతో జవహర్‌నగర్ కాలనీలో నూతనంగా హై మాస్ లైట్‌లను కూడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాగా కాలని వాసులు ఎన్నో ఏళ్లుగా భారీ వర్షాలకు రోడ్డు చాలా ఇబ్బంది మారిందన్నారు. ఎన్నికలలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం సీసీ రోడ్డు వేయించినందుకు ఎమ్మెల్యే, సర్పంచ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరచ సాయన్న, ఉప సర్పంచ్ కొంగర్ల శారద రాజన్న, బిఆర్ఎస్ నాయకులు చట్ల తరుణ్, తాండ్ర శ్రీనివాస్, చట్ల వినీల్, రాజు, వార్డు సభ్యులు, యువజన సంఘం సభ్యులు, కాలని వాసులు తదితరులు పాల్గొన్నారు.

# జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో నేత్ర, అవయవ దాన అవగాహన సదస్సు

**అపోహలు వీడి ప్రజలందరు నేత్ర అవయవ దానానికి ముందుకు రావాలి - జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్**

**బెల్లంపల్లి, జనవరి 20, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలం బుధ కలాన్ గ్రామంలో నిర్వహించిన మహిళ సమాఖ్య సమావేశంలో జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో సదాశయా ఫౌండేషన్ వారి సహకారంతో నేత్ర, అవయవ, శరీర దాన అవగాహన సదస్సు, అంగీకార పత్రాలు స్వీకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి నేత్ర, అవయవ శరీర దానం గొప్పదని, పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక తప్పదని, ప్రజలందరూ మరణించిన తరువాత నేత్ర, అవయవ, శరీరాలు వృధా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని, నేత్ర దానం ద్వారా మరణించిన మన కళ్ళ ద్వారా ఈ ప్రపంచాన్ని చూసే అద్భుత అవకాశాన్ని అందరు ఉపయోగించుకోవాలని కోరారు. నేత్రదానం చేసినపుడు మరణించిన తరువాత ఎనిమిది గంటలలోపు మరణించిన వ్యక్తి యొక్క కళ్లలోని కార్నియా పొరని మాత్రమే సేకరిస్తారని నేత్ర దానం ద్వారా ఇద్దరు అందులకి చూపు ప్రసాదించి వారి ద్వారా మరణించిన ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో అవయవాలు అవసరం ఉన్న ఎనిమిది మంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని అలాగే శరీర దానం ద్వారా పార్థివ దేహాన్ని వైద్య కళాశాల కి అందించి కొన్ని వేల వైద్య విద్యార్థుల బోధనకు ఉపయోగపడి ప్రజల వైద్య చికిత్సకి ఉపయోగపడే అవకాశం ఉందని ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుధ కలాన్ గ్రామ సర్పంచ్ దాడి నగేష్, ఉప సర్పంచ్ చింతపురి అనసూర్య, వార్డు సభ్యులు ఆవుల రాజన్న, కోట సుధాకర్, ఒరగంటి సంపత్, పాయబోయిన స్వప్న, రాంపెల్లి శ్రీనివాస్, హాజరైన మహిళా సంఘం సభ్యులు సుమారు 50 మంది నేత్ర అవయవ దానానికి అంగీకారం తెలియడం జరిగింది. అందరిని అభినందిస్తూ జనహిత సేవా సమితి, సదశయా ఫౌండేషన్ ద్వారా డోనర్ కార్డులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోట కరుణాకర్ శరీర దానానికి ముందుకు రావడంతో వారిని అభినదిస్తూ శాలువతో సత్కరించి డోనర్ కార్డ్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించి నేత్ర అవయవ దానానికి



ముందుకు వచ్చిన గ్రామ సర్పంచ్ దాడి నగేష్, ఉప సర్పంచ్ చింతపురి అనసూర్య, వార్డు సభ్యులు మహిళా సంఘం సభ్యులు ప్రతి ఒక్కరికి జనహిత సేవా సమితి తరపున కృతజ్ఞతలు తెలువుతు మీ స్పూర్తితో మరిన్ని నేత్ర, అవయవ, శరీర దాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి హరిక్రిష్ణ, వెలుగు కో ఆర్డినేటర్ రాజనాల సుందరేష్ జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్, కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, గౌరవ సలహాదారులు సింగతి తిరుమల్ కార్యవర్గ సభ్యులు మోటపకుకుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చింతగూడ కోయవాగు అభయాంజనేయ స్వామి దేవాలయంలో 24 గంటల ఎక్కామ భజన

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 20, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ కోయవాగు అభయాంజనేయ స్వామి దేవాలయంలో 24 గంటల ఎక్కామ భజన కార్యక్రమం మంగళవారం ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ప్రారంభం అయింది. ప్రతీ సంవత్సరం మాఘశుద్ధ పంచమి రోజు వార్షికోత్సవం సందర్భంగా 24 గంటల ఎక్కామ భజన నిర్వహించడం జరుగుతుదని తెలిపారు. సాయంత్రం శోభాయత్ర ఉంటుందని . మంగళవారం ఉదయం 7.25 ప్రారంభమైన ఎక్కామ భజన బుధవారం ఉదయం ముగుస్తుందని అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు తొగిటి వెంకటేశ్వర ఆచార్యులు, హనుమాన్ స్వాములు,గ్రామ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

## గ్రామీణ ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన

**సిరికొండ, జనవరి 20, ప్రభాతవార్త:**

సిరికొండ గ్రామాలలో ఉన్న ప్రతి ఒక్కరికి ఆర్థిక అక్షరాస్యత అవసరమని సర్పంచ్ జాదవ్ దినేష్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మసాగర్ గ్రామంలో వీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్బిఐ వారి సహకారంతో గ్రామీణ స్థాయి ఆర్థిక అక్షరాస్యతపై తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వేణు ప్రసాద్ సమస్యలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతాలు ఉండాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తోన్న సామాజిక భద్రత ఇన్సూరెన్స్‌లను ప్రతి ఒక ఖాతాదారుడు బ్యాంక్‌ల ద్వారా చేయించుకోవాలని సూచించారు. వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చే సైబర్ క్రైమ్, ఏపీకే లింక్‌లు ఓపెన్ చేయవద్దని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపిలు అడిగితే సమాచారం చెప్పవద్దన్నారు. అటువంటి ఫోన్ కాల్స్ వస్తే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. మహిళలు పొదుపులో ముందుంటారని పొదుపు చేసిన డబ్బులను బ్యాంకులో జమ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ ఎల్ కౌన్సిలర్లు సంతోష్, అరవింద్, ప్రసాద్, గ్రామ పెద్దలు బిక్కు నాయక్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



## ధర్మారం ఊరి చెరువులో మొసలి కలకలం

**హాజీపూర్, జనవరి 20, ప్రభాతవార్త**

హాజీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మారం గ్రామంలోని ఊర చెరువులో మొసలి కనిపించడం కలకలం రేపింది. మంగళవారం ఉదయం కొందరు పశువుల కాపారులు చెరువు వద్దకు వెళ్లగా గట్టు మీద సేద తీరుతున్న మొసలి కనిపించడంతో ఒడ్డుకు పరుగులు తీశారు. ఈ విషయాన్ని అధికారులకు తెలిపిన స్పందించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో చెరువు వైపు వెళ్లాలంటేనే గ్రామస్తులు, పశువుల కాపారులు జంకుతున్నారు. చెరువులో ఉన్న మొసలి వలన చేపలు కూడా తగ్గిపోతాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మొసలిని బంధించి మరో చోటికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ధర్మారం ఊరి చెరువులోని మొసలి

## గణతంత్ర వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

**- ప్రగతి స్టేడియంలో పనులను పరిశీలించిన శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, జనవరి 20, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి స్టేడియంలో ఈ నెల 26న నిర్వహించనున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్సవాలకు సంబంధించిన ముందస్తు పనులన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆయా విభాగాల అధిపతులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొనే వారందరికీ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేడుకల్లో భాగంగా వివిధ గనుల్లో ఎంపిక చేసిన ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, మార్చ్ ఫాస్ట్, సాంస్కృుతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకల్లో శ్రీరాంపూర్ ఏరియా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎంలు ఆనంద్ కుమార్, రవీందర్, ఏబీ హరి నారాయణ, క్వాలిటీ మేనేజర్ కె. వెంకటేశ్వర రెడ్డి, డీవైపీఎం ఎం. రాజేష్, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్